సాక్షి ఒడిశా

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 8,00,314
బంగారం	3 గ్రాముల 550 మిల్లీ గ్రాములు
వెండి	35 గ్రాముల 250 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



100 స్టార్టప్‌లు..

ఉత్కళ రాష్ట్ర అవతరణ శత వార్షికోత్సవం నాటికి భువనేశ్వర్ ఐఐటీ ప్రాంగణంలో 100 స్టార్టప్ సంస్థలు ఏర్పాటు కానున్నాయని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

- 8లో



బీజేడీతోనే సుస్థిర పాలన

రాష్ట్ర ప్రజలకు సుస్థిర పాలన అందించేది ఒక్క బీజేడీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

విజిలెన్స్ అడ్వైజర్‌గా దాశరథి పట్నాయక్



దాశరథి పట్నాయక్

జయపురం: జయపురంలో సీనియర్ న్యాయవాది దాశరథి పట్నాయక్ విజిలెన్స్ విభాగ చట్టం అడ్వైజర్‌గా నియమితులయ్యారు. రాష్ట్రంలో మొదటి సారిగా నియమించిన ఏడుగురు అడ్వైజర్లలో ఈయన ఒకరు. కొరాపుట్ డివిజన్‌లో ఈయన బాధ్యతలు నిర్వర్తిస్తారు. దాశరథి పట్నాయక్ గతంలో కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ చీఫ్ డిఫెన్స్ కౌన్సిలర్‌గా పనిచేశారు.

జయపురం విద్యార్థినికి కృషిరత్న అవార్డు



అవార్డుతో హర్షిత

జయపురం: జయపురం మోడరన్ ఇంగ్లీషు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న హర్షితకు 'కృషి రత్న' అవార్డు లభించింది. కనుమరుగవుతున్న దేశీ ధాన్య వంగడాలను, చోళ్ల విత్తనాల సంగ్రహణ, వాటి రక్షణలో హర్షిత చేస్తున్న కృషికి గుర్తింపుగా శనివారం భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమయెు మీడియా ఈ పురస్కారం ప్రదానం చేసింది.

టీఏసీ సభ్యులుగా సింహాద్రి, బబునా



ఛిత్రి సింహాద్రి

పర్లాకిమిడి: బరంపురం టెలిఫోన్ అడ్వైయిజరీ కమిటీ ప్యానల్ (టీఏసీ) సభ్యులుగా మూడో నెంబరు వార్డు కౌన్సిలరు బబునా బెహరా, కాశీనగర్ సమితి చైర్మన్ ఛిత్రి సింహాద్రి (రాణిపేట) ఎంపికైనట్లు డివిజనల్ టెలిఫోన్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. గజపతి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సైతం బీఎస్ఎన్ఎల్ టవర్లు మెరుగైన పనితీరు కనబరిచేలా చర్యలు తీసుకుంటామని ప్రజా ప్రతినిధులు తెలిపారు. వీరి ఎంపికపై పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు.

ఘంటసాలకు ఘన నివాళులు



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న చైతన్య ఆంధ్ర సాహితీ సమితి సభ్యులు

పర్లాకిమిడి: మధుర గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో పాతపట్నం రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత చైతన్య ప్రార్థన గీతంతో ప్రారంభించి అనంతరం ఘంటసాల ఆలపించిన పాటలు, వేంకటేశ్వరుని భక్తి గీతాలు, సినీ పరిశ్రమలో ఆయన చేసిన కృషిని చైతన్య సమితి కార్యదర్శి బర్నాల జనార్దనరావు వివరించారు. ఘంటసాల ఆలపించిన గీతాలు చిరస్మరణీయమన్నారు. తన మధుర గాత్రంతో ఎన్నో చిత్రాలు విజయం కావడంలో దోహదపడ్డారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఘంటసాల వెంకటేశ్వరరావు ఆలపించిన భగవద్గీత ప్రతి తెలుగు వారి మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. ఆయన మనకు దూరమై ఐదు దశాబ్దాలు గడిచినా ఆయన ఆలపించిన గీతాలు మనతోనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో చైతన్య సమితి అధ్యక్షుడు కూర్మాపు ఆనందరావు, పారశెల్లి రామరాజు, ఐ.వెంకటరావు, వాసుదేవరాజు, బి.ఈ.ఓ టి.కిశోర్‌కుమార్, ఎస్.ఎన్.పండా, కె.చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు రక్తసిక్తం



భువనేశ్వర్: ప్రమాదంలో నుజ్జయిన పికప్ వ్యాన్, టాటా మ్యాజిక్

- ఝార్సుగుడ జిల్లాలో ట్రక్కు–వ్యాన్ ఢీ
- నలుగురు దుర్మరణం.. తొమ్మిది మంది పరిస్థితి విషమం
- బరంపురం జిల్లాల్లో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



భువనేశ్వర్: సహాయక చర్యల్లో స్థానికులు



బరంపురం : ట్రక్కు ఢీకొనడంతో మృతి చెందిన యువకుడు



బరంపురం నారసింహాపూర్ రోడ్డులో ధ్వంసమైన ఆటో



బరంపురం : ట్రక్కులు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన డ్రైవర్

భువనేశ్వర్: రాష్ట్రంలో పలుచోట్ల రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఝార్సుగుడ జిల్లా లఖన్‌పూర్ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పికప్ వ్యాన్ టాటా మ్యాజిక్, బొగ్గుతో నిండిన ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా.. మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఝార్సుగుడ జిల్లా జునియెన్ సమీపంలోని 49వ నంబరు జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు పికప్ వ్యాన్‌లో పంచొగాంవ్ నుంచి బెలొపాహడా వెళ్తుండగా ఎదురుగా బొగ్గుతో నిండిన భారీ ట్రక్కు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న 13 మంది ప్రయాణికుల్లో ఇదరు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వీరి మృతదేహాల్ని లఖన్‌పూర్ ఠాణా పోలీసులు స్వాధీనపరచుకుని పంచనామా కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో చేర్పించగా చికిత్స పొందుతు తుదిశ్వాస విడిచారు. మిగిలిన 9 మంది క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి గురైన టాటా మ్యాజిక్ వాహనం బాధితులు, మృతుల వివరాలు తెలియలేదు. లఖన్‌పూర్ ఠాణా పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

రెండు రోజులు..నాలుగు ప్రమాదాలు

బరంపురం: బరంపురం జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శని,ఆదివారాల్లో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయా ఘటనల్లో ఇద్దరు మృత్యువాత పడగా, మరో ఆరుగురు గాయపడ్డారు. బరంపురం ఎస్పీ సర్వాణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని 16వ నంబర్ జాతీయ రహదారి హల్దియాపదర్ ఓవర్ బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా రెండు ట్రక్కులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా క్లీనర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా, నగర శివారులోని నారసింహాపూర్ రహదారిలో ఆటో–బస్సు ఢీకొన్న ఘటనలో ఆటోలో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పోలీసుల సహకారంతో ఎంకేసీజీ మెడికల్‌లో చేర్పి చికిత్స అందిస్తున్నారు. మరో ఘటనలో.. శక్తి సినిమా థియేటర్ వద్ద స్కూల్ బస్సు స్కూటీని ఢీకొట్టడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. ఉదయం నగర శివారులోని సదర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఫస్ట్‌గేట్ జంక్షన్‌లో ట్రక్కు బైక్ ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని యువకుడు దుర్మరణం పాలయ్యాడు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



భువనేశ్వర్: ధ్వంసమైన ట్రక్కు

తాగునీటి కోసం కొట్లాట



రోడ్డుపై ఆందోళన చేస్తున్న స్థానికులు

- నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ ఓ వర్గం ఆందోళన
- జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

జయపురం: ఇరువర్గాల మధ్య తాగునీటి వివాదం కొట్లాటకు దారి తీసింది. పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగడంతో జాతీయ రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి పుప్పుగాంలో రెండు వర్గాల వారు తరచూ గొడవలకు దిగుతున్నాయి. ఏ చిన్న అంశం దొరికినా వాగ్వాదం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం గొట్టపు బావి వద్ద నీరు పడుతుండగా ఇరువర్గాలు గొడవకు దిగారు. చివరకు కొట్లాడుకున్నారు. అందులో ఓ వర్గం వారు బొరిగుమ్మలోని న్యాయవాది వద్దకు వెళ్లగా.. మరోవర్గం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బయలుదేరారు. ఈ సమయంలో ప్రత్యర్థి వర్గం వారు కాపుకాశి దాడి చేయడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవలని డిమాండ్ చేస్తూ బాధితులంతా 26వ నంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ఇరువర్గాల పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు బొరిగుమ్మ పోలీసు అధికారి యుగళ కిశోర్ షా తెలిపారు. క్షతగాత్రులను బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

నవరంగ్‌పూర్ ఎంపీకి త్రుటిలో తప్పిన ప్రమాదం

- పంక్చర్ కావడంతో కారు బోల్తా
- ఎంపీ, డ్రైవర్, గన్‌మేన్లకు స్వల్ప గాయాలు



నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి



తుప్పల్లోకి దూసుకుపోయిన కారు

కొరాపుట్: నవరంగ్‌పూర్ ఎంపీ, బిజూ జనతా దళ్ నేత రమేష్ చంద్ర మజ్జి ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తు ఆయనతో పాటు కారులో ప్రయాణిస్తున్న వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఛత్తీస్‌గఢ్ నుంచి తన ఇంటికి వెళ్తుండగా ఆదివారం వేకువజామున నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణం సమీపంలో ఎంపీ వెళ్తున్న కారుకు పంక్చర్ కావడంతో గోతిలో పడింది. అప్పటికే గాయాల పాలైన ఎంపీ కారు నుంచి బయటకు రావడానికి ప్రయత్నం చేశారు. కారులో ఉన్న డ్రైవర్, గన్‌మేన్ అచేతన స్థితికి చేరుకున్నారు. ఎంపీ మనోధైర్యంతో తన ఫోన్‌లో ఉమ్మర్ కోట్ పోలీసులకు, బిజూ జనతాదల్ కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని కారులో ఉన్న రమేష్‌తో పాటు మిగతా ఇద్దరినీ బయటకు తీసి ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం వైద్యులు తమ పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. కానీ ఎంపీ తిరస్కరిస్తూ తనకు ఏమీ కాలేదని ఇంటికి వెళ్లి పోయారు. అయితే ఎంపీ కాలికి తీవ్ర గాయమైందని వైద్యులు ప్రకటించారు. ఆదివారం ఉదయం 'సాక్షి'తో ఎంపీ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో తాను క్షేమంగా ఉన్నానని చెప్పారు. ముందుగా ప్రకటించిన విధంగా ఏ కార్యక్రమం రద్దు చేయవద్దని ప్రకటించారు. శనివారం రాత్రి భారత పార్లమెంట్‌లో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యి నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనం ముందు భాగం దెబ్బతినగా, ఎంపీ, ఆయన డ్రైవర్, వ్యక్తిగత అంగరక్షకునికి గాయాలయ్యాయి. ఉమర్‌కోట్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం అందరూ ఇంటికి చేరుకున్నారు. డ్రైవర్ కునుకుపాటు తప్పిదంతో ఈ ప్రమాదం జరిగిందని ఎంపీ తెలిపారు. డ్రైవరు కాలుకు గాయాలయ్యాయని, ప్రస్తుతం ఆయన కూడా క్షేమంగా ఉన్నాడని ఎంపీ తెలిపారు.

ఘనంగా సహస్ర పుష్పయాగం



వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ముత్తయిదువుల సహస్ర పుష్పయాగం



పూజలు నిర్వహిస్తున్న బాలాజీరాజు దంపతులు

పర్లాకిమిడి: స్థానిక కొత్త బస్టాండు రోడ్డులోని పెట్రోలు బంక్ వెనక ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పునర్మించిన కల్యాణ మండపాన్ని వ్యాపారవేత్త వైశ్యరాజు కాశీరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పుష్పయాగంలో గజపతి సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కన్యకాపరమేశ్వరీ ఆలయ ధర్మకర్త వి.బాలాజీరాజు, రాధిక దంపతులు, పొట్నూరు రామకృష్ణ దంపతులు, కోట్ని సోమేశ్వరరావు దంపతులతో పాటు 150 మంది ముత్తయిదువులు పాల్గొన్నారు. సహస్ర పుష్పయాగం, అగ్నిగుండ ప్రవేశం వంటి పూజా కార్యక్రమాలు పూజారి వనమాలి మణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

పార్టీ విజయానికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న కొండబాబు, కాశీనాయుడు తదితరులు

రాయగడ: పార్టీ విజయానికి కృషి చేస్తామని బీజేడీ రాయగడ శాఖ అసంతృప్త సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు అన్నారు. ఆదివారం జిమిడిపేట హనుమాన్ మందిరం సమీపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వ్యక్తిగతంగా ఎన్ని విభేదాలు ఉన్నా ఎన్నికల సమయంలో అధిష్టానం పార్టీ టిక్కెట్టు ఎవరికి కేటాయిస్తే వారి విజయానికి కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో కాశీనాయుడు, సీనియర్ న్యాయవాది బిరజా పాత్రొ, చొక్రొబిడిక తదితరులు పాల్గొన్నారు. కాగా, ఓవైపు కెరడ గ్రామంలో బీజేడీ కార్యకర్తల సమావేశంలో రాజ్యసభ మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు పాల్గొంటే.. అదే రోజు ఆ పార్టీ అసంతృప్త నాయకుడు కొండబాబు జిమిడిపేటలొ వేరుగా కార్యకర్తల సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది.

300 కిలోల గంజాయి సీజ్



గంజాయి, నిందితులతో బరంపురం ఎక్సైజ్ బృందం

బరంపురం: కొంధమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల్లో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు బరంపురం జిల్లా ఎక్సైజ్ అధికారులు గజపతి జిల్లా నుంచి బరంపురం నగర శివారు పుకిడి బొందా వరకు తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా ఉన్న మూడు కార్లలో సోదాలు చేయగా 300 కిలోలా గంజాయి గుర్తించారు. గంజాయి, కార్లను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఫిరోజ్‌ఖాన్, మహమ్మద్ షరఫ్, గంజాం జిల్లా పులసరా బ్లాక్‌కు చెందిన మహేశ్వర్ పాత్రో, అజీత్ బెహరాలుగా గుర్తించారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని బరంపురం జిల్లా ఎక్సైజ్ గోవింద విభాగం సూపరింటెండెంట్ కుబేర్ కుమార్ సెఠి తెలిపారు. కొంధమాల్–గంజాం జిల్లా సరిహద్దులోని కళింగా ఘాట్‌పై బల్లిగుడా పోలీసులు తనిఖీలు చేయగా టాటా వ్యాన్‌లో 90 కిలోల గంజాయి సీజ్ చేశారు. ఆటోను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు.



కళింగా ఘాట్ రోడ్డులో స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

క్రికెట్ టోర్నమెంట్ విజేత గొడొ రత్తిపూర్



బహుమతి ప్రదానోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

భువనేశ్వర్: జట్నీ మునిసిపాలిటి కుదియారి గ్రామం కేసీసీ మైదానంలో ఆదివారం జరిగిన కుదియారి సిబునా స్మారక టీ–20 క్రికెట్ టోర్నీ విజేతగా గొడొరత్తిపూర్ జట్టు విజేతగా నిలిచి చాంపియన్‌షిప్ షీల్డ్ అందుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో కుదియారి క్రికెటు క్లబ్ జట్టుపై విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన కుదియారి క్రికెట్ క్లబ్ బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గొడొ రత్తిపూర్ జట్టు 19 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసి విజేతగా నిలిచింది. 24 బంతుల్లో 57 పరుగులలు సాధించిన సౌరవ్ జగదేవ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జట్నీ నాగరిక కమిటీ అధ్యక్షుడు మన్మథ రౌత్రాయ్, స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఈఓ రమేష్‌బాబుకు అందజేస్తున్న దాత నగేష్, ఉష దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖ వాస్తవ్యులు బి.వెంకటవ్యాస నగేష్, ఉష దంపతులు ఆదివారం ఉదయం రూ.1,00,116 విరాళాన్ని ఈఓ రమేష్‌బాబుకు అందజేశారు. ఈ మేరకు ఈఓ స్పందిస్తూ రూ.లక్ష, అంతకు మించి విరాళాలిచ్చిన దాతలకు ఏటా రథసప్తమి వంటి పర్వదినాల్లో డోనర్ పాసులను అందజేస్తామని ప్రకటించారు. అనంతరం నిత్యాన్నదాన రశీదును దాతలకు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు కిరణ్‌శర్మ తదితరులున్నారు.

కమ్మసిగడాం జాతర పోస్టర్ ఆవిష్కరణ



కమ్మసిగడాం జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రణస్థలం: ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించే కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు, సభ్యులు కమ్మసిగడాం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 16న రథసప్తమి శుక్రవారం ఉదయం 8గంటలకు శుభరాట వేస్తామని, వ్యాపారస్తులు ముందుగా వచ్చిన వ్యాపార స్థలాలు బాగు చేసుకోవాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, సభ్యులు రాజా రవింద్ర, తేజ, రాజశేఖర్, మన్నె లక్ష్మీ ప్రసాద్, సింహాచలరాయుడు, కృష్ణారావు, చినబాబ, బాబి తదితరులు ఉన్నారు.

నదిలో పడి వ్యక్తి మృతి



నీటిలో ఉన్న జగ్గునాయుడు మృతదేహం

గార: మండల కేంద్రంలోని వంశధార నదిలో నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి వద్ద కుమ్మరిపేట గ్రామానికి చెందిన మళ్ల జగ్గునాయుడు (86) కాలు జారిపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జగ్గునాయుడు ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కాలకృత్యం కోసం నది వద్దకు వెళ్లారు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటంతో కాలుజారి పడిపోయారు. మృతదేహంపైకి తేలిన తర్వాత స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ కె. కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు తమ్ముడు మళ్ల కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం రైల్వే ట్రాక్‌పై ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అనంతరం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 35 ఏళ్లకు పైబడి ఉంటుందని, ఎరుపుగీతల చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు.

పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ కొత్తముక్కాం గ్రామానికి చెందిన కుందు ఆనంద్(30) వేటకు వెళ్లి పడవ బోల్తా పడడంతో మృతి చెందాడు. గ్రామస్తులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తముక్కాం గ్రామానికి చెందిన ఆనంద్, మరో ముగ్గురు కుందు పోలిరాజు, మైలపల్లి పోతురాజు, కుందు అమ్మోరులు నలుగురు శనివారం మధ్యాహ్నం రెండు సమయంలో సముద్రంలోని మత్స్య వేటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం 5గంటల సమయంలో వస్తుండగా ఒడ్డుకు చేరే క్రమంలో తెప్ప బోల్తా పడి ఆనంద్ ఇసుకలో కూరుకుపోయాడు. వెంటనే మిగిలిన ముగ్గురు ఒడ్డుకు చేర్చి 108 వాహనంపై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి వివాహం కాలేదు. తల్లి రాములమ్మ, తండ్రి పోలీసు, ముగ్గురు అక్కలు ఉన్నారు. మృతుడి తండ్రి కుందు పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఒడిశా శత వార్షికోత్సవం నాటికి 100 స్టార్టప్‌లు

- ఒక్కో స్టార్టప్ పెట్టుబడి రూ.100 కోట్లు
- రీసెర్చ్ పార్కు ప్రారంభోత్సవంలో కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



ఐఐటీ రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పార్క్ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: ఉత్కళ రాష్ట్ర అవతరణ శత వార్షికోత్సవం 2036 నాటికి స్థానిక భారత సాంకేతిక సంస్థ (ఐఐటీ) ప్రాంగణంలో 100 స్టార్టప్ సంస్థలు ఏర్పాటు కానున్నాయని, ఇందులో ఒక్కో సంస్థలో రూ.100 కోట్లు పెట్టుబడి ఉంటుందని కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. 100 క్యూబ్ స్టార్టప్ నినాదంతో కార్యాచరణ కొనసాగుతుందన్నారు. స్థానిక ఐఐటీ రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పార్క్‌లో 100 క్యూబ్ స్టార్టప్ కాంక్లేవ్ ప్రారంభోత్సవం సందర్భంగా 1,500 సీట్లతో కూడిన ఆడిటోరియాన్ని మంత్రి ప్రారంభించారు. రూ.450 కోట్లు విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు నిర్మాణానికి మంత్రి ఈ శంకుస్థాపన చేయడం విశేషం. రానున్న రెండేళ్లలో 20,000 చదరపు అడుగుల విస్తీర్ణపు రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పార్క్ దాదాపు 80,000 చదరపు అడుగులకు విస్తరిస్తుందని, ఇందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూ. 130 కోట్లు మంజూరు చేస్తుందని చెప్పారు. భారత ప్రధాన మంత్రి ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ దార్శనికతకు అనుగుణంగా యువతలో ఉజ్వలమైన చైతన్య భావాల్ని ప్రేరేపించి బంగారు భవిష్యతుని ఆవిష్కరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లకు సమష్టి పరిష్కారాలను అందించడంలో ఐఐటీలు, ఎన్ఐటీలు, ఏఐసీటీఈ వంటి సంస్థలు కీలక పాత్రధారులుగా నిలవాలని పేర్కొన్నారు. ఒడిశాలో 40 శాతం స్టార్టప్‌లు మహిళల సారథ్యంలో విజయవంతంగా పని చేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముందున్న సవాళ్లను ప్రస్తావిస్తూ వికసిత్ భారత్ దిశగా సమష్టి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సమాచారం, మార్కెట్లు, నిధుల ప్రాప్యతను మెరుగుపరచడం, ప్రక్రియలను క్రమబద్ధీకరించడం వంటి చర్యలు స్టార్టప్ రంగం శరవేగంగా పుంజుకునేందుకు దోహదపడతాయన్నారు. ఈ నేపథ్యంలో సంస్థలు, వాటాదారుల మధ్య సహాయక పర్యావరణ వ్యవస్థ, పరస్పర అనుసంధానం అవసరం అన్నారు. జాతీయ విద్యా విధానం-2020లో విద్యార్థి, అధ్యాపకుల భాగస్వామ్యం అత్యంత కీలకమని చెప్పారు. పరిశోధన, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతపై దృష్టి సారించిన విద్యాబోధన పునర్నిర్వచించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇందుకు స్థానిక ఐఐటీ మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు.

- ఐఐటీ పాలక మండలి బోర్డు చైర్మన్ డాక్టర్ ఆర్.పి.సింగ్ మాట్లాడుతూ సమతుల్యమైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిష్కరణలు, పరిశోధనలు సమాజాభివృద్ధిలో ప్రాముఖ్యత సాధించాలని తెలిపారు.
- టాటా స్టీల్ ఎండీ, సీఈఓ టి.వి.నరేంద్రన్, జనరల్ అటామిక్స్ గ్లోబల్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ వివేక్‌లాల్, జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ ఎండీ, సీఈఓ డాక్టర్ ఆశిష్ కుమార్ చౌహాన్, ఫిన్లాండ్ మంత్రి, డిప్యూటీ హెడ్ మిషన్ డాక్టర్ టిటో గ్రోనో, నీతీ అయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ ఓబెన్ ఎలక్ట్రిక్ సహ వ్యవస్థాపకురాలు, సీఈఓ మధుమిత అగర్వాల్ ప్రసంగించారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో 100 క్యూబ్ స్టార్టప్ చొరవ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్ మాట్లాడుతూ 100 క్యూబ్ స్టార్టప్ ఇనిషియేటివ్ ఒడిశాను వ్యవస్థాపకత కేంద్రంగా, దేశంలో స్టార్టప్ సంస్కృతిని పెంపొందించే దిశగా ఐఐటీ భువనేశ్వ ముఖ్యమైన మైలురాయిని ఆవిష్కరిస్తుందన్నారు.

15 కంపెనీలతో అవగాహన ఒప్పందాలు..

100 క్యూబ్ లక్ష్యాన్ని సాధించేందుకు స్థానిక ఐఐటీ 15 కంపెనీలతో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయిల్ ఇండియా లిమిటెడ్ సీఎండీ రంజిత్ రథ్, ఐఐటీ భువనేశ్వర్ ఇంక్యుబేట్ చేసిన 4 స్టార్టప్‌లకు రూ.3.5 కోట్ల విలువైన గ్రాంట్ చెక్కులు అందజేశారు.



ఔత్సాహిక సంస్థలతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసరు శ్రీపాద కర్మలకర్



విజ్ఞాన సాంకేతిక ప్రదర్శనలో విద్యార్థులు



సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన సందర్శనలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



ఐఐటీ రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రూనియర్‌షిప్ పార్కులో ప్రారంభమైన సువిశాల ఆడిటోరియం

బీజేడీతోనే సుస్థిర పాలన



నెక్కంటి భాస్కరరావును గజమాలతో సన్మానిస్తున్న కార్యకర్తలు

రాయగడ: రాష్ట్ర ప్రజలకు సుస్థిర పాలన అందించేది ఒక్క బీజేడీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. సదరు సమితి పరిధిలోని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కెరడ గ్రామంలో ఆదివారం పార్టీ సీనియర్ నాయకుడు బి.రఘురాం, ఎస్.సతీష్, దేవేంద్ర మజ్జిల నేతృత్వంలో మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని, బీజేపీ పతనావస్థకు చేరుకుందని విమర్శించారు. బీజేడీ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే పింఛన్లను మరో రూ.500 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. వచ్చే నెల ఒకటి నుంచి కొత్త పెన్షన్ అందుతుందన్నారు. రెండు దశాబ్దాల కిందట వరకు కెరడ పంచాయతీతో పాటు పితామహాల్, బిలేసు, శెశిఖాల్, బొడొరాయిసింగి, కంచికవలస తదితర ప్రాంతాలు కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచాయని, అయితే నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ అధికార పగ్గాలు చేపట్టాక పరిస్థితి మారిపోయిందన్నారు. అభివృద్ధి చేపట్టని కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొట్టారని చెప్పారు. నవీన్ పాలనలోనే రాయగడ శాసనసభ నియోజకవర్గం పరిధిలో మారుమూల గ్రామాలకు సైతం రహదారులు, విద్యా, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు చేరువయ్యాయని వివరించారు.

సమరానికి సై..

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తామంతా సిద్ధంగా ఉన్నామని నెక్కంటి ప్రకటించారు. ప్రజలు మరోసారి నవీన్ పట్నాయక్‌నే ముఖ్యమంత్రిగా చూడాలని ఉత్సాహపడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో కార్యకర్తలు కలసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జిమిడిపేట నుంచి వేదిక వరకు నెక్కంటికి కార్యకర్తలు బైకులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. కార్యక్రమం రాష్ట్ర మాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, ఉపాధ్యక్షుడు హరప్రసాద్ హెప్రుక, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు

వీనులవిందుగా రఘునాథ పాత్రో సంగీత విభావరి



రఘునాథ పాత్రో సంగీత జీవనయాత్రపై సంకలనం విడుదల చేసిన ఎంపీ చంద్రశేఖరసాహు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: పట్టణంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు రఘునాథ పాత్రో సంగీతంలో ప్రవేశించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్లాకిమిడి ప్యాలస్ వద్ద అర్బన్ బ్యాంకు గ్రౌండ్స్‌లో ఆదివారం 'సంగీతమయి 50' పేరిట సంగీత విభావరి ఏర్పాటు చేశారు. సంగీత కళాకారుల కమిటీ అధ్యక్షుడు నృసింహా చరణ్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎం.పి.చంద్రశేఖర సాహు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత శ్రీకాకుళంకు చెందిన వీణావాయిద్య కళాకారుల బృందం గోనాభక్తుల రవిబాబు, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ (పాలకొండ), మృదంగంలో గోనాభక్తుల బ్రహ్మం కడురమ్యంగా మహాగణపతిం ఆలపించారు. అనంతరం జరిగిన సంగీత కచేరిలో రఘునాథ పాత్రో, ఇవటూరి మన్మధరావు, భువనేశ్వర్‌కు చెందిన కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయులు గౌరహరి పండాను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమానికి ఆదర్శ దాస్, డాక్టర్ చందన్ గంతాయత్ ముఖ్యవక్తగా వ్యవహరించగా, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనామంగరాజ్ సహకరించారు.



శ్రీకాకుళం సంగీత కళాకారులు రవిబాబు సంగీత కచేరీ

ఆదివాసీ విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం

జయపురం: ఆదివాసీ పిల్లలు స్వతహాగా ప్రతిభావంతులని, వీరికి కమ్యూనికేషన్ స్కిల్స్, ఫౌండేషన్ నాలెడ్జ్ పెంచాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ దిబాకర షాడంగి అన్నారు. జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో టీచర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఆఫ్ ట్రైబల్ చిల్డ్రన్ సెమినార్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. వీసీ ప్రొఫెసర్ దేవీప్రసాద్ మిశ్ర అధ్యక్షత జరిగిన ఈ సెమినార్‌లో సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ మాట్లాడుతూ గిరిజన సమస్యలపై యూనివర్సిటీలు విస్తృతంగా పరిశోధనలు నిర్వహించాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ నిత్యానంద ప్రధాన్, ఇగ్నో కొరాపుట్ ప్రాంతీయ డైరెక్టర్ లటిక మిశ్రా, కేంద్ర విశ్వవిద్యాలయం ఒడిశా ప్రొఫెసర్ భరత్ పండా, బాలాసూర్ ఎఫ్.ఎం, యూనివర్సిటీ డాక్టర్ అమూల్య ఆచార్య, డీఏవీ కళాశాల ప్రొఫెసర్ దేవేంద్ర శెట్టి, ఎన్‌సీఈఆర్‌టి న్యూఢిల్లీ ప్రొఫెసర్ శారద సిన్హా తదితరు పరిశోధనపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సన్మానించారు.



ఫ్యాకల్టీని సన్మానిస్తున్న దృశ్యం

ఒడియా సాహితీవేత్త శతకొడి హొత్తా అస్తమయం

భువనేశ్వర్: ప్రముఖ సాహితీవేత్త, ఒడిశా సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు శతకొడి హొత్తా (95) అనారోగ్యంతో ఆదివారం భువనేశ్వర్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారిగా, ఖుర్దా రోడ్ మాజీ డివిజనల్ సూపరింటెండెంట్ (డీఎస్)గా, ఒడియా దినపత్రిక 'ది సమయ'కు సంపాదకుడిగా వ్యవహరించారు. 2013 మార్చి 6 నుంచి 2016 మార్చి 5 వరకు ఒడిశా సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా పనిచేసి అనేక కాలాతీతమైన కవితలు, నవలలు, చిన్న కథలు, వ్యాసాలు రచించారు. 2018కి గాను ప్రతిష్టాత్మక సాహిత్య భారతి సమ్మాన్‌ను అందుకున్నారు.

అధికారిక లాంఛనాలతో..

శతకొడి హొత్తా అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ గౌరవ లాంఛనాలతో జరుగుతాయని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఈ మేరకు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కథలు, నవలలు, కవితలు, అనువాద సాహిత్యాన్ని ఆవిష్కరించడం ద్వారా ఒడియా సాహిత్య ప్రపంచంలో తన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. నైపుణ్యం కలిగిన ఆర్గనైజర్‌గా, జర్నలిస్ట్‌గా పేరుగాంచారని పేర్కొన్నారు.



శతకొడి హొత్తా(ఫైల్)

ఆగిన లారీని ఢీకొన్న కారు

- ఒకరు మృతి

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్ సమీప జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం లింగాలపాడు పంచాయతీ పరిధి ఎర్రన్న పేట గ్రామానికి చెందిన బలగ గోపి(26) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు గోపి తన దగ్గరి బంధువు పెళ్లి ఆదివారం జరుగుతుండటంతో ఆ పెళ్లికి వచ్చిన చుట్టాలను వారి గ్రామం దిగబెట్టేందుకు కారులో తురకలకోట వైపు వెళ్లాడు. అయితే వారిని అక్కడ దిగబెట్టి తిరిగి వస్తుండగా టెక్కలి సమీపంలోని అయ్యప్పనగర్ వద్దకు వచ్చేసరికి తన వాహనం ముందు వెళ్తున్న బండిని తప్పించే ప్రయత్నంలో రోడ్డు పక్కగా నిలిపి ఉన్న కంటైనర్ లారీని బలంగా ఢీకొన్నాడు. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయిపోగా అందులో గోపీ చిక్కుకుపోయాడు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీశారు. అయితే అప్పటికే ప్రాణాలు పోయాయి. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అప్పటి వరకు పెళ్లి పనుల్లో హుషారుగా పాల్గొన్న కుర్రాడు చనిపోయాడని తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి అప్పమ్మ ఉన్నారు. తండ్రి కూడా గతంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.



ప్రమాదంలో మృతి చెందిన గోపి



ప్రమాదానికి గురైన కారు

సాహిత్య పరిరక్షణతోనే జాతి మనుగడ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథులు

జయపురం: జాతి మనుగడకు భాషా, సాహిత్యాల పరిరక్షణ ఎంతో అవసరమని వక్తలు పేర్కొన్నారు. జయపురం ప్రభుత్వ మహిళా కళాశాలలో నువా ఓ ఒడిశా సాహిత్య పోటీలు ముగింపు సందర్భంగా ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివేకానంద సున అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జయపురం ఆకాశవాణి కేంద్రం అధికారి నరేంద్రనాథ్ పట్నాయక్ మాట్లాడుతూ ఒడియా భాషను భావితరాలకు అందించేందుకు భాషను మరింత విస్తృత పరచాలని కోరారు. అనంతరం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సాహితీవేత్త కృష్ణకుమారి నందో, విశ్వవిద్యాలయ చరిత్ర ప్రొఫెసర్ డాక్టర్ కనకలత మహాపాత్రో, నోడల్ అధికారి డాక్టర్ డొంబురుదొర దాస్ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల నోడల్ అధికారి సునీతా కుమారి, సాహిత్యవేత్త డాక్టర్ ప్రదీప్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మే 21న దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం


దాడితల్లి అమ్మవారు

బొబ్బిలి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు,కోరిన వరాలిచ్చే కల్పవల్లి బొబ్బిలిలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం జరగనుంది. ఈమేరకు గ్రామ పెద్దలు, కమిటీ నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమై మార్చి25న పండగ చేసేందుకు నిర్ణయించారు. ఏప్రిల్ 21న గుర్తించిన ప్రాంతంలో సిరిమానును కొట్టి గ్రామంలోకి తీసుకువస్తారు. అప్పటి నుంచి ఘటాల ఊరేగింపు జరుగుతుంది. మే 19న దేశమ్మతల్లి ఉత్సవం, 20న తొలేళ్ల ఉత్సవం, 21న సిరిమాను ఊరేగింపు జరుగుతాయని ఉత్సవ కమిటీ ప్రకటించింది.

18న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు


కరాటే పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 18న రాజాంలో నిర్వహించనున్నామని కరాటే మాస్టర్ ఆర్.శివ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ శివ సైన్యం కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీలకు 15 జిల్లాల నుంచి 350 మంది అభ్యర్థులు, 20 మంది ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొంటారన్నారు. కాటా, కుమిటీ విభాగాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం విజేతలను బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. అనంతరం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు టీవీ అచ్యుత్‌కుమార్, రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, కరాటే ట్రైనర్ ఆర్.అనూరాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

1300 సారా ప్యాకెట్ల స్వాధీనం


సాలూరు: నిందితుడిని చూపిస్తున్న ఎస్సై సీతారాం

సాలూరు: పట్టణంలో ఓ వ్యక్తి నుంచి సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీతారాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, సీఐ జి.డి.బాబుకు అందిన సమాచారం మేరకు , ఆయన ఆదేశాలతో సిబ్బందితో కలిసి తాను మాటువేసి, పట్టణంలోని డబ్బివీధిలో ఉండే పి.సంతోష్ అనే వ్యక్తి నుంచి 1300 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

6కిలోలగంజాయి పట్టివేత


పాచిపెంట: పట్టుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్ పోస్టు వద్ద 6 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్సై నారాయణరావు తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేపట్టగా ఒడిశా రాష్ట్రానికి చెందిన సానియా జాని, కేదారినాథ్ పాత్రోలు ద్విచక్ర వాహనంపై వస్తూ 6 కిలోల గంజాయితో పట్టుబడ్డారని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

గుర్తు తెలియని మహిళ మృతి



దత్తిరాజేరు: మండలంలో ని చౌదంతివలస కూడలి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్న కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుమారు 60 సంవత్సరాలు వయస్సున్న మహిళ ఎటు నుంచిఎక్కడికి వెళ్తోందో తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు ఎస్సై ఎస్ బూర్జవలస పోలీస్‌స్టేషన్ ఫోన్ 91211 09461 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

- ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు బాగు
- జిల్లావ్యాప్తంగా రైతుల ఆసక్తి
- ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంలో భాగంగా సాగు


బొబ్బిలి సమీపంలో పామాయిల్ సాగు

రాజాం: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి విలేజ్అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, హార్టికల్చర్ అసిస్టెంట్‌లను నియమించింది. వీరు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి, పంటల్లో యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం చేసేలా కృషిచేస్తున్నారు. వాటికి తోడు రైతు భరోసా సాయం , సకాలంలో క్రాప్ రుణాలు అందించడం, పండిన పంటను స్థానికంగా విక్రయించుకునే ఏర్పాట్లుచేయడంతో జిల్లాలో వ్యవసాయంపై రైతుల ఆసక్తి పెరిగింది. నిత్యం ఒకేలా ఉండే పంటలు కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలపై కూడా రైతులు దృష్టిసారించేలా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉద్యానవనశాఖ విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించి, ఖరీఫ్ పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక ఆదాయం ఇచ్చే పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పామాయిల్ ను దృష్టిలో పెట్టుకుని ఈ తోటలకు అనువుగా ఉన్న ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ శతశాతం రాయితీతో మొక్కలు అందించి దీర్ఘకాలిక ప్రయోజనాలు రైతులు పొందేలా చర్యలు చేపట్టింది.

జిల్లా వ్యాప్తంగా 2050 హెక్టార్లలో..

2019కి ముందు జిల్లాలో 16 వందల హెక్టార్లలో మాత్రమే పామాయిల్ సాగు ఉండేది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా వ్యవసాయానికి నిరుపయోగంగా ఉన్న పొలాలతో పాటు తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక ఆదాయం పొందాలనుకునే రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించింది. ఫలితంగా ఈ నాలుగున్నరేళ్లలో జిల్లాలో పామాయిల్ సాగు మరో 450 హెక్టార్లకు పెరిగి ప్రస్తుతం 2050 హెక్టార్లలో సాగవుతోంది. మరో 600 హెక్టార్లలో ఈ పంటను సాగుచేసేందుకు ఉద్యానవనశాఖకు రైతులు దరఖాస్తు చేసుకున్నారు.


రేగిడి మండలం ఖండ్యాం సమీపంలో కొత్తగా వేసిన పామాయిల్ తోట


రేగిడి మండలంలో రెడ్డిపేట వద్ద పామాయిల్ మిల్లు

శతశాతం రాయితీ..

పామాయిల్ తోటల పెంపకం చాలా సులువు. మొక్కలు పొలాల్లో వేసిన తరువాత మూడేళ్ల తరువాత ప్రతి 15 రోజులకు ఒకదఫా పూత వస్తుంది. ఎకరా పొలంలో 57 నుంచి 60 మొక్కలు వేయాల్సి ఉంటుంది. ఈ మొక్కలు వేసేందుకు పెట్టుబడి రూ. 50 వేలు పెట్టాల్సి ఉండగా, అదులో రూ. 29 వేలు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుంది. కొన్నిచోట్ల ఉద్యానవనశాఖతో పాటు వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేట్ కంపెనీలు సంయుక్తంగా శతశాతం రాయితీపై మొక్కలు అందజేస్తున్నాయి. కేవలం మొక్కలకు గోతుల తీయడం, మొక్కలు నాటడం వంటి రైతువారీ పనులకు మాత్రమే పెట్టుబడి అవసరం ఉంటుంది. వాటికి కూడా కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం హెక్టారుకు సంవత్సరానికి రూ.5250లు చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ. 21 వేలు, అంతర పంటలు సాగుచేస్తే నాలుగేళ్లకు రూ. 21 వేలు పెట్టుబడి ఇస్తుంది. ఈ పంటకు అవసరమైన బిందు సేద్యం నిమిత్తం పైపులు సైతం 60 నుంచి 90 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తుంది.


బిందుసేద్యానికి అందించిన రాయితీ పైపులు

ఆదాయం కూడా బాగే

జిల్లాలో పామాయిల్ ఉత్పత్తి మిల్లులు ఆరుచోట్ల ఉన్నాయి. ఈ మిల్లర్లు రైతుల వద్దకు నేరుగా వచ్చి పామాయిల్ పంటను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 19 మండలాల్లో పామాయిల్ సాగులో ఉండగా కొత్తగా ఏడు మండలాలకు విస్తరించింది. ఎక్కువగా బొబ్బిలి మండలంలో పామాయిల్ సాగు అధికంగా ఉంది. చోరభయం, చీడపీడల ఇబ్బందులు లేని పంట కావడంతో పాటు అందుబాటులో కొనుగోలుదారులు ఉండడం విశేషం. ప్రస్తుతం పామాయిల్ పిక్కల టన్ను ధర రూ. 12,140లు ఉంది. ఎకరాలో ఏడాదికి 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఖర్చులు పోను రైతు ఏడాదికి రూ.1 లక్ష వరకూ ఆదాయం పొందవచ్చు. ఈ లబ్ధిని వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలు రైతుల్లోకి తీసుకెళ్లడంతో పామాయిల్ తోటలు పెరగడంతో పాటు రైతులు కూడా ఆసక్తిగా పంటను సాగుచేస్తున్నారని జిల్లా ఉద్యానవనశాఖ డీడీ ఏవీఎస్‌వీ జమదగ్ని తెలియజేస్తున్నారు.

భారీ ఆధిక్యంలో ఆంధ్ర

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: 261/10,
రెండో ఇన్నింగ్స్: 271/5
పశ్చిమబెంగాల్ తొలి ఇన్నింగ్స్: 198/10


సెంచరీతో రాణించిన ఆంధ్రా కెప్టెన్ రికీబుయ్

విజయనగరం రూరల్: ఆంధ్రా రంజీ జట్టు కెప్టెన్ రికీబుయ్ తన ఫామ్ కొనసాగిస్తూ సెంచరీ సాధించగా, పశ్చిమబెంగాల్ జట్టుతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 334 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. డెంకాడ మండలంలోని చింతలవలసలో గల ఏసీఏ ఆధ్వర్యంలో డాక్టర్ పీవీజీరాజు నార్త్‌జోన్ క్రికెట్ మైదానంలో ఆంధ్ర-పశ్చిమబెంగాల్ జట్ల ఈ నెల 9 నుంచి జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో మూడో రోజైన ఆదివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు కెప్టెన్ రికీ బుయ్ సెంచరీ (100 నాటౌట్) సాయంతో 92 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి ఆంధ్రా జట్టు 271 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్రా ఓపెనర్లు డీబీ ప్రశాంత్‌కుమార్ (7 పరుగులు), కె.మహీప్‌కుమార్ (14) తక్కువ స్కోర్ వద్ద వెనుదిరగ్గా, మాజీ కెప్టెన్ హనుమ విహారీ 48 పరుగులతో రాణించాడు. 100 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయిన అనంతరం బ్యాటింగ్ వచ్చిన కెప్టెన్ రికిబుయ్ ఆట ముగిసే సమయానికి 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా, అతనికి తోడుగా వైస్ కెప్టెన్ ఎస్‌కె రషీద్ 42 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 94 పరుగులతో, రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో రికిబుయ్ రాణించాడు. బెంగాల్ జట్టు బౌలర్ సౌరభ్‌కుమార్ 29 ఓవర్లలో 73 పరుగులు ఇచ్చి 3 కీలకమైన వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 63 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకుని ఆంధ్రా జట్టు 334 పరుగుల ఆధిక్యంలో ఉంది. సోమవారం ఆటకు ఆఖరిరోజు కావడంతో ఫలితం తేలే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

యోగా శరణం గచ్ఛామి..!

- పరీక్షల కాలంలో ప్రాణాయామంతో ప్రయోజనం
- దూరం కానున్న ఒత్తిడి
- రోజూ 25 నిమిషాలు చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుదల


తలవరం హైస్కూల్‌లో యోగా చేస్తున్న పదో తరగతి విద్యార్థులు


ఆసనం వేసి చూపిస్తున్న గురువు జనార్దనరావు

వీరఘట్టం: విద్యార్థులకు ఇది పరీక్షల కాలం. మార్చి 1 నుంచి ఇంటర్మీడియట్, మార్చి 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు. నీట్ నుంచి ఐఐటీ వరకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇది క్లిష్టమైన సమయం. అన్నింటికి మార్కులతో కుస్తీ పడాలి. ఇది కేవలం జ్ఞాపకశక్తితో చేసే పోరాటం కాదు. తనువు, మనసు కలగలిసి ఏకోన్ముఖంగా సాగాలి. ప్రశాంత చిత్తానికి ఏకాగ్రతకు లంకె కుదరాలి. లక్ష్య సాధనకు, అలుపెరగని ప్రయత్నానికి అన్వయం సరిపోవాలి. పుస్తకాలు ముందేసుకుని గంటలకొద్దీ కుస్తీ పడితే సాగిపోయే వ్యాసంగం కాదిది. శరీరంలోని అణువణువు చైతన్యవంతమైతే లక్ష్యం పాదాక్రాంతమవుతుంది. అలాంటి శక్తులను ఇచ్చి విద్యార్థిలో అనంతశక్తిని నింపగలిగేది యోగా ఒక్కటేనని నిపుణులు చెబుతున్నారు. యోగాలో ప్రాణాయామం, ఆసనాల వంటి ప్రక్రియలు ఉన్నాయి. వాటిని రోజుకు 25 నిమిషాలు సాధన చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు శారీరక రుగ్మతలు దూరమవుతాయి. ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి దోహదపడుతుందని యోగా గురువులు చెబుతున్నారు. అందులో భాగంగా వీరఘట్టం మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిరోజూ పదో తరగతి విద్యార్థులు 25 నిమిషాల పాటు యోగాసనాలు వేస్తూ ఏకాగ్రతను సొంతం చేసుకుంటున్నారు.

నిత్యం సాధన చేయాలి

యోగాసనాలతో పాటు ప్రాణాయామం నిత్యం సాధన చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పరీక్షల సమయంలో సాధారణంగా తలెత్తే ఒత్తిడి సమస్యను అధిగమించవచ్చు. దీని వల్ల పరీక్షలకు బాగా సిద్ధమై మంచి మార్కులు సాధించవచ్చు.

– కె.జనార్దనరావు, యోగా గురువు

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలను ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. 35 సంవత్సరాల వయస్సు నుంచి 75 సంవత్సరాల వయసు గల పురుషులు, మహిళలకు 9 కేటగిరీలలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 95 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి మూడు రోజుల పాటు రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు తెలిపారు. క్రీడాకారులు జిల్లా స్థాయిలో ప్రతిభకనబరచడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయదుందుభి మ్రోగించి విజయనగరం జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎంకేబీ శ్రీను, కార్యదర్శి వై.కె.బచ్చన్, సహాయ కార్యదర్శి నున్న సురేష్, మీడియా ఇన్‌చార్జ్ ఎస్.మల్లికార్జున రావు, కోశాధికారి ఎం.అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యులు అపర్ణ బాబా, వి.డి.గిరి, సూర్య బహదూర్ థాపా, ఎల్.శ్రీనివాసరావు, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మాస్టర్స్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

భాషల పునరుద్ధరణకు విస్తృత స్థాయి పరిశోధన


పుస్తకావిష్కరణలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: భారతీయ భాషల పునరుద్ధరణకు పరిశోధనలు విస్తృతస్థాయిలో జరగాలని అందుకు పత్రికల పాత్ర ఎంతో కీలకమని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవశ్యకతపై డాక్టర్ బొండా రామకృష్ణ, డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ రాసిన 'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఇట్స్ రిలవెన్సెస్' అనే పరిశోధన పుస్తకాన్ని ఆదివారం ఆయన తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆంధ్రయూనివర్సిటీ జర్నలిజం ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న గిరిజన భాషల పునరుజ్జీవానికి సెంటర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు.

మన్యంలో పర్యాటకుల తాకిడి


బొమ్మ ట్రైన్‌పై ఆడుతున్న చిన్నారులు

సీతంపేట: మన్యంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. స్థానిక అడ్వెంచర్ పార్కులో పలు సాహస క్రీడల్లో పాల్గొన్నారు. బంజీట్రంపోలిన్, బొమ్మట్రైన్, జలవిహార్‌లో బోటు షికారు వంటివి చేసి ఉల్లాసంగా గడిపారు.


బంజీట్రంపోలిన్‌పై బాలిక

నాడు నేర్చుకున్న విద్యతో నేడు ఉపాధి

- ఆత్మవిశ్వాసమే ఆలంబన


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న కోచ్ శ్రీనివాసరావు


సాధించిన పత్రాలు, కప్‌లతో కోచ్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: చిన్నవయస్సులో కలిగిన ఆసక్తితో నేర్చుకున్న విద్య నేడు కూడు పెడుతోందంటూ ఓ కరాటే మాస్టార్ జీవం లేని నవ్వుతూ చెబుతూ కరాటేలో చిచ్చర పిడుగుల్ని తయారు చేస్తున్నాడు. గుండెల నిండా ఆత్మవిశ్వాసం, విద్యపట్ల అంకిత భావం, లక్ష్యంపై దీక్ష ఉన్నా పేదరికం ఆయన పాలిట శాపమైంది. ఎస్.కోటలో నివాసం ఉంటున్న వంకల శ్రీనివాసరావు కరాటేలో 'బ్లాక్‌బెల్ట్ 5డాన్' గా అర్హత సాధించి మాస్టర్‌గా నిలిచారు. అటుపై స్థాయిలు సాధించేందుకు మంచి శిక్షణ, భోజనం, వసతి అవసరం. ఇటు సంసారం సాగే దారిలేక, డబ్బు పెట్టలేక ఆర్థికస్థోమత సరిపోక ఆశలు వదులుకున్నారు.

ఆత్మవిశ్వాసమే ఆలంబనగా..

మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన వంకల శ్రీనివాసరావుకు బ్రూస్‌లీ సినిమాతో ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలనే ఆలోచన చిన్నతనంలో మొదలైంది. తిమిడి జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదివేటప్పుడు కొత్తవలస స్కూల్‌లో కరాటే నేర్పుతున్నారని తెలిసి సైకిల్‌పై కొత్తవలస వెళ్లిపోయాడు. అక్కడ గురువు ఈవీవీ ప్రసాద్ శిష్యరికం చేసి 8 ఏళ్ల పాటు కరాటే సాధన చేశాడు. తర్వాత విశాఖలోని గోపాలపట్నానికి దిన కనకారావు మాస్టర్ వద్ద ఐదేళ్లు సాధనచేసి 2022జనవరిలో సికింద్రాబాద్‌లో వైడబ్ల్యూసీఏ నేతృత్వంలో నడుస్తున్న ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన టోర్నీలో బ్లాక్‌బెల్ట్ సాధించాడు.

రోజు కూలీగా శిక్షణ ఇస్తూ..

ఆర్థిక స్థోమత లేక ఇంటర్‌మీడియట్‌తో చదువు ఆపేసిన శ్రీనివాసరావు ఇల్లు గడవడం కోసం 1998నుంచి పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు కరాటేలో శిక్షణ ఇవ్వడం ఆరంభించాడు. ఒక రోజు పిల్లలకు క్లాస్ చెబితే రూ.30, 50 రోజుకూలిగా ఇచ్చేవారని చెబుతున్నారు. వ్యవసాయకూలీ కుటుంబంలో పుట్టిన తనకు ఐదుగురు అక్కలు ఉండడంతో ఆస్తి కన్నా అప్పులే ఎక్కువ మిగిలాయని వాపోయారు. సంసార బాధ్యతలతో స్కూళ్లలో రెగ్యులర్ కరాటే కోచ్‌గా జాయిన్ అయి ఇప్పుడు మెరికల్లాటి విన్నర్స్‌ను తయారు చేసే పనిలో పడ్డాడీ మాస్టర్. ప్రస్తుతం ఈమాస్టర్ వద్ద శిక్షణ పొందుతున్న ఎస్.నీలేష్, జె.జగదీష్, ఎం.తరుణ్‌లు ఇంటర్నేషనల్స్, నేషనల్స్, ఏషియన్ గేమ్స్‌లో స్వర్ణ, రజత పతకాలు సాధించారు.

స్పాన్సర్ చేస్తే మరింత సాధించాలని

కరాటేలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఉంది. అందుకు సరైన శిక్షణ, వసతి, భోజనం అవసరం. నాకు తగిన ఆర్థిక స్థోమత లేక మక్కువ ఉన్నా వదులుకున్నాను. ఎవరైనా సాయం చేస్తే మరింత ఉన్నత స్థాయికి ఎదగాలనే కోరిక ఉంది. పూర్తిస్థాయి గ్రాండ్‌మాస్టర్‌గా ఎదిగి ఈ ప్రాంతం యువతను తయారు చేయాలనేది లక్ష్యం.

– వంకల శ్రీనివాసరావు, బ్లాక్‌బెల్ట్ 5డాన్, ఎస్.కోట

కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర తేదీల ఖరారు

- మార్చి 17, 18, 19 తేదీల్లో జాతర నిర్వహణ
- తేదీలు వెల్లడించిన ఎంపీ బెల్లాన
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలిరానున్న భక్తులు


శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర తేదీలు వెల్లడిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఆలయ కమిటీ, వైఎస్సార్‌సీపీ నాయకులు


శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాల తేదీలు ఖరారయ్యాయి. దీంతో అందరూ ఎదురుచూసే అమ్మవారి జాతర రానే వచ్చింది. జాతర తేదీలను గ్రామ పెద్దలు, దేవస్థానం కమిటీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతర తేదీలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాలను మార్చి 17, 18, 19 తేదీల్లో మూడు రోజులు పాటు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచనలతో అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించినట్టు చెప్పారు. ఆనవాయితీ ప్రకారం ప్రతీ ఏటా మహాశివరాత్రి తరువాత తొలి ఆదివారం నుంచి మూడు రోజులు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర జరగాల్సి ఉంటుందని, అయితే ఈ ఏడాది మహాశివరాత్రి తరువాత వచ్చే ఆదివారం అమావాస్య కావడంతో మార్చి 17, 18, 19 తేదీల్లో జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు స్పష్టం చేశారు. ఆ మూడు రోజులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, తెలంగాణ నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారని చెప్పారు. అమ్మవారి జాతర నిర్వహణకు సంబంధించి ఈ నెలాఖరును అమ్మవారి దేవస్థానంలో అధికారులు, గ్రామ పెద్దలు, కమిటీ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్, కమిటీ సభ్యులు వంకల కృష్ణ, అద్దాల రవి, సూరు కామేష్, ఎస్‌విజి.శ్రీను, అలిగి శ్రీను, కెల్ల మోహనరావు, పాండ్రంకి వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, మీసాల రామారావు, గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, కోరుకొండ దాలయ్య, మల్లెంపూడి శ్రీను, కింతలి మధు, మురళి, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.